క్లుప్తంగా

పరామర్శ



దుర్గప్ప మృతదేహానికి నివాళులర్పిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్

పెనుకొండ రూరల్: గుట్టూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు దుర్గప్ప (72) శనివారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. దుర్గప్ప మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పొగాకు రామచంద్ర, వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల కన్వీనర్లు నరసింహులు, సుధాకర్ రెడ్డి, సర్పంచ్ నాగరత్నమ్మ, నాయకులు నారాయణ స్వామి, పిట్టాబాబు, రవి, కొండల రాయుడు, తదితరుల పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

అమరాపురం: స్థానిక ఆరోగ్య మైత్రి కూటమి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు కూటమి సభ్యులు డాక్టర్ బసవరాజు, రమేష్ తెలిపారు. కర్ణాటక రాష్ట్రం చిత్రదుర్గం నుంచి స్త్రీల వ్యాధి నిపుణురాలు జ్యోతి, పావగడ నుంచి సామాన్య వ్యాధి నిపుణుడు ఓంకార్ నాయక్ హాజరు కానున్నట్లు వారు తెలిపారు. స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయం వెనుక భాగంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వీఎస్ఎస్ఎన్ అధ్యక్షుడిగా మహేశ్



అధ్యక్షుడిని అభినందిస్తున్న మాజీ మంత్రి

పావగడ: తాలూకా లోని పొన్నసముద్రం వీఎస్ఎస్ఎన్ (వ్యవసాయ సేవా సహకార సంఘం) అధ్యక్షుడిగా పీహెచ్ మహేశ్ రెండోసారి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. స్థానిక వీఎస్ఎస్ఎన్ కార్యాలయంలో అధ్యక్ష స్థానానికి శనివారం ఎన్నికలు జరిగాయి. మహేశ్ ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి వెంకటేశ్ తెలిపారు. సహకార సంఘంలో మొత్తం 13 మంది డైరెక్టర్లు ఉండగా, అందులో ముగ్గురు మహిళలు ఉన్నారు. తన గెలుపునకు సహకారం అందించిన ఎమ్మెల్యే వెంకటేశ్, మాజీ మంత్రి వెంకటరమణప్ప, డీసీసీ బ్యాంక్ డైరెక్టర్ టీఎన్ నరసింహయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి వెంకటరమణప్పను కలిసి సన్మానించారు.

ఇంటర్ పరీక్షకు 72 మంది గైర్హాజరు

మడకశిర: నియోజకవర్గంలో శనివారం జరిగిన ఇంటర్ పరీక్షకు 72 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఇంటర్ బోర్డు అధికారులు తెలిపారు. నియోజకవర్గంలోని మడకశిర,అగళి, గుడిబండ, అమరాపురంలో ఏర్పాటు చేసిన ఏడు కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. ఈపరీక్షకు 1,551 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 1,479 మంది హాజరైనట్లు వారు తెలిపారు.

వేంకటరమణుడికి సంప్రోక్షణ పూజలు



హోమాలు నిర్వహిస్తున్న దృశ్యం

మడకశిర: పట్టణంలోని కోట వేంకటరమణ స్వామి ఆలయంలో శనివారం రెండోరోజూ సంప్రోక్షణ పూజలు జరిగాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేద పండితులు వివిధ రకాల హోమాలు నిర్వహించారు. వేంకటరమణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఆదివారం అష్టబంధన కుంభాభిషేకాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

బాధితులకు జపానందస్వామి చేయూత



బాధితులకు పరిహారం అందించిన జపానంద స్వామి

పావగడ: తాలూకాలోని కేటీ హళ్లిలో జరిగిన అగ్ని ప్రమాదంలో పేద రైతులు రామణ్ణ, శివణ్ణకు చెందిన షెడ్‌తో పాటు సరుకులు, వంట సామగ్రి, ధాన్యం, గడ్డి వాములు , ఆవు కాలిపోయాయి. విషయం తెలుసుకున్న రామకృష్ణ సేవాశ్రమాధిపతి స్వామి జపానందస్వామి శనివారం ఘటనా స్థలానికి చేరుకున్నారు. స్వామీజీ బాధితులను పరామర్శించారు. వారికి నిత్యావసర సరుకులు, వంట సామగ్రి అందించారు. స్థానిక వాల్మీకి జాగృతి వేదిక అధ్యక్షుడు లోకేశ్ పాశేగార్, రాంపురం నాగేశ్, భాస్కర నాయక, నివృత్త సైనికుడు అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

కోరిన కోర్కెలు తీర్చే లక్ష్మీనృసింహుడు

- 12 నుంచి బ్రహ్మోత్సవాలు
- వేలాదిగా తరలిరానున్న భక్తులు
- 14,19న దాతల సహకారంతో అన్నదానం
- ఏర్పాట్లు చేస్తున్న కమిటీ సభ్యులు



బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన రొళ్ల లక్ష్మీనరసింహస్వామి దేవాలయం



లక్ష్మీనరసింహాస్వామి మూల విరాట్

రొళ్ల: మండల కేంద్రంలో వెలసిన లక్ష్మీనరసింహాస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 12 నుంచి 21వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. 12న అంకురార్పణ, 13న కళస స్థాపన, స్వామి వారికి కల్యాణోత్సవం, యోగీశ్వరాధన, 14న బ్రహ్మరథోత్సవం, 15న వసంతోత్సవం, మీసలు (సేకరణ) కలియుట, రొళ్లకొండ పై దివ్య జ్యోతి దర్శనం, 16న స్వామి ఉత్సవం, గరుడోత్సవం, 17న పూల పల్లకీ ఉత్సవం, 18న దేవతా సంకీర్తనాలు, 19న భూతప్ప సేవలు (ఉత్సవం) తలనీలాలు సమర్పణ, 20న 101 ప్రసాద వినియోగం, భక్తులతో ముడుపుల ఉత్సవం, 21న మహా మంగళారతి, భక్తులకు ప్రసాద వినియోగం ఉంటుంది. 14,19న జరిగే బ్రహ్మరథోత్సవం, భూతప్పల సేవలు రోజున దాతలు వేలాది మందికి అన్నదానం నిర్వహించనున్నారు.

కాలిస్పర్శ కోసం వేల సంఖ్యలో పోటెత్తే భక్తజనం..

రొళ్ల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 19న జరిగే భూతప్ప సేవలు విశేషం. భూతప్పస్వామి కాలిస్పర్శ తాకితే కష్టాలు తొలగుతాయని భక్తులు నమ్మకం. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచే కాకుండా కర్ణాటక నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలి రానున్నారు. రత్నగిరి రోడ్డులో వెలసిన ఈర ముద్దమ్మదేవి ఆలయం నుంచి స్వామివారి ఆలయ ప్రాంగణం వరకూ కిలోమీటర్ల మేర చన్నీటీ స్నానం ఆచరించి తడి దుస్తులతో భక్తులు పొర్లుదండాలు పెడతారు.

ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి..

రొళ్ల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం కోసం ఈనెల 12 నుంచి 21వ తేదీ వరకు మడకశిర ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేకంగా శిరా, మధుగిరి, పావగడ, మడకశిర, పెనుకొండ ఇతరాత్ర ప్రాంతాల నుంచి ఆర్‌టీసీ బస్సులు నడపాలని కమిటీ సభ్యులు, భక్తులు కోరుతున్నారు. బ్రహ్మోత్సవాలకు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసులను కమిటీ సభ్యులు కోరుతున్నారు.

లక్ష్మీనరసింహస్వామికి 600 ఏళ్ల చరిత్ర



రొళ్ల లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి 600 ఏళ్ల నాటి చరిత్ర ఉంది. ఏటా మాఘ మాసం తర్వాత శుద్ధ త్రయోదసి రోజు నుంచి వారం రోజుల పాటు బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. బ్రహ్మోత్సవాలకు ఉమ్మడి అనంతపురం జిల్లా నలుమూలల నుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి వేలాది సంఖ్యలో తరలిరానున్నారు. **వెంకటేష్, ప్రధాన అర్చకుడు, రొళ్ల**

భూతప్పల కాలిస్పర్శ తాకితే పాపాలు తొలుగుతాయి



మాఘమాసం శుద్ధ త్రయోదశి రోజు ప్రారంభం కానున్న లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు తప్పని సరిగా హాజరవుతాం. ముఖ్యంగా 14న జరిగే బ్రహ్మరథోత్సవం, 19న జరిగే భూతప్పల ఉత్సవానికి ప్రత్యేకంగా హాజరవుతాం. భూతప్ప ఉత్సవం రోజున తెల్లవారుజామున చన్నీటి స్థానం ఆచరించి నియమనిష్ఠలతో తడి దుస్తులతో భూతప్పల కాలిస్పర్శ కోసం భూతప్పలు వచ్చే దారిలో బోర్ల పడుకొంటాం. ఇంట్లో ఎవరో ఒకరు ప్రతి ఏటా భూతప్పల కాలిస్పర్శ కోసం బోర్ల పడుకొంటాం. **యామిని, భక్తురాలు, భద్రాపుర, సికారిపుర తాలూకా, శివమొగ్గ జిల్లా, కర్ణాటక రాష్ట్రం**

లేగదూడలకు బ్రూసెల్లా టీకా పంపిణీ



పశువులకు వ్యాక్సిన్లు వేస్తున్న దృశ్యం

అగళి: పశువులకు వ్యాధులు సోకకుండా లేగ దూడ వయస్సులోనే టీకా వేయించాలని వెటర్నరీ లైవ్ స్టాక్ అధికారి కృష్ణమోహన్ సూచించారు. మాధుడి,రామపురం తదితర గ్రామంలో పెయ్యదూడలకు బ్రూసెల్లా టీకా వేసే కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 4 నెలల నుంచి 8 నెలల వయస్సులోపు ఉన్న పెయ్యదూడలకు టీకా వేసినట్లు తెలిపారు. ఈ నెల 31 వరకు పశు వైద్య సిబ్బంది రైతుల ఇంటి వద్దకు వెళ్లి లేగదూడలకు టీకా వేస్తారని తెలిపారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ శివకుమార్ పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

అమరాపురం: మండలంలోని హలుకూరు ఏపీ మోడల్ స్కూల్‌లో ఆరోతరగతిలో ప్రవేశానికి ఈనెల 31లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఓబుళపతి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన సీఅండ్ ఐజీ మిషన్ చర్చ్ సంఘ కార్యవర్గ సభ్యులు

హిందూపురం: పట్టణంలోని సీఅండ్ ఐజీ మిషన్ చర్చ్, మిషన్ కాంపౌండ్ సంఘ నిర్వహణకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు సంఘ పాస్టర్, ప్రెసిడెంట్ డాక్టర్ స్టీఫెన్ రాజు శనివారం తెలిపారు. రెండేళ్ల కాలపరిమితికి కార్యవర్గ బాధ్యతలు నిర్వహణకు సంఘ కార్యదర్శిగా డాక్టర్ ఎ.నాగేంద్ర కుమార్, కోశాధికారిగా జె.సాల్మన్ రాజ్, సహకార్యదర్శిగా పి.అరుణ్ కుమార్, సహ కోశాధికారిగా కె.దేవరాజ్, గాస్పల్ కోఆర్డినేటర్‌గా ఆంజనేయులు, సండే స్కూల్ కోఆర్డినేటర్‌గా బి.రూబేన్ పాల్, గౌరవ సభ్యులుగా జార్జ్ బాబును ఎన్నుకున్నారు.

అనారోగ్యంతో వెలుగు సీసీ మృతి

మడకశిరరూరల్: హరేసముద్రం క్లస్టర్‌లో వెలుగు కమ్యూనిటీ కోఆర్డినేటర్ జయప్రకాష్ (44) కడుపు నొప్పితో బాధపడుతూ శనివారం మృతి చెందాడు. కర్నూలు ఆస్పత్రిలో వైద్య చికిత్సలు పొందుతూ మృతి చెందాడు. మృతిడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మార్షల్ ఆర్ట్స్ శిక్షణ ప్రారంభం

హిందూపురం: స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో నియోజకవర్గ మార్షల్ ఆర్ట్స్ శిక్షణ తరగతులను ఎంఈఓ గంగప్ప శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ, రూపేష్ వెల్ఫేర్ సొసైటీ కరాటే మాస్టర్ ఫిరోజ్ మాట్లాడుతూ అమ్మాయిలు, మహిళలు భద్రతకు సంబంధించిన విషయాల్లో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యార్థినులకు కరాటే శిక్షణ ఇవ్వాలని విద్యాశాఖ నిర్ణయించిందన్నారు.

రాజీ మార్గం కక్షిదారులకు ప్రయోజనం



హిందూపురంలో అవార్డు ప్రతిని అందజేస్తున్న న్యాయమూర్తులు కంపల్లె శైలజ, లలితా లక్ష్మీహారిక, రమణయ్య



పెనుకొండలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వాసుదేవన్



మడకశిరలో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జడ్జి అశోక్‌కుమార్

హిందూపురం అర్బన్: రాజీ మార్గంతో కేసులను పరిష్కరించుకోవడం ద్వారా కక్షిదారులకు ఎంతో ప్రయోజనంగా ఉంటుందని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ అన్నారు. శనివారం ఉదయం స్థానిక న్యాయస్థానంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి లలితా లక్ష్మీ హారిక, ప్రత్యేక న్యాయమూర్తి రమణయ్యలతో కలసి అదనపు జిల్లా జడ్జి లోక్ అదాలత్ ప్రారంభించారు. కోర్టు ఆవరణలో మూడు బెంచ్‌లను ఏర్పాటు చేసి 255 కేసులను పరిష్కరించారు. రూ. 1,23,50,000 విలువ జేసే 9 సివిల్ కేసులు పరిష్కరించగా ఆరు ప్రమాద బీమా కేసులు ద్వారా రూ.44,35,000కు పరిష్కారమయ్యాయి. అలాగే 66 ఐపీసీ కేసులు, 92 మద్యం కేసులు పరిష్కరించి రూ.4,74,025 అపరాధ రుసుం విధించారు. 9 ఇసుక అక్రమ రవాణా కేసులను పరిష్కరించి రూ.28 వేలు అపరాధ రుసుం విధించారు. రెండు భరణం కేసులు బాధితులకు రూ.10 లక్షలు ఇప్పించారు. మూడు గృహ హింస కేసులు పరిష్కారమయ్యాయి. చెక్‌బౌన్స్ కేసు పరిష్కరించి రూ.1.20 లక్షలు ఇప్పించారు. రూ.61,700 విలువజేసే ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించారు. 58 చిన్న పాటి కేసులు పరిష్కరించి రూ.1,12,100 జరిమానాలు విధించారు. హాజరైన వారందరికీ భోజన సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో ఏపీపీ నగేష్, ఏజీపి శ్రీనివాసరెడ్డి, బార్ అసోషియేషన్ అధ్యక్షులు రాజశేఖర్, లోక్ అదాలత్ సభ్యులు నాగరాజు, సతీష్, సుధాకర్, న వేరా, ఉదయ్‌సింహరెడ్డి, సంతోషి కుమారి, లోక్ అదాలత్ సిబ్బంది హేమావతి, శారద, న్యాయయవాదులు, వివిధ బ్యాంకుల మేనేజర్లు, కక్షదారులు పాల్గొన్నారు.

పెనుకొండ: మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి వాసుదేవన్ పేర్కొన్నారు. పట్టణంలోని కోర్టు ఆవరణలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం, జాతీయ మెగా లోక్‌అదాలత్ నిర్వహించారు. సివిల్, క్రిమినల్, బ్యాంక్, ప్రాంసరీ నోట్లు తదితర కేసులను న్యాయమూర్తులు సమీక్షించారు. పలు కేసులను రాజీ చేశారు. 93 క్రిమినల్, 24 ఎక్సైజ్, 163 ఎన్ఐ యాక్ట్ కేసులు, 1 సివిల్ కేసు జ్యుడిషియల్ సెకెండ్ క్లాస్ కోర్టులో 25 పీఎల్‌సీఎస్ కేసులు పరిష్కరించారు. కార్యక్రమంలో ఏజీపీ భాస్కర్‌రెడ్డి, బార్ అధ్యక్షులు మదన్‌మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 159 కేసుల పరిష్కారం

మడకశిర: పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం జడ్జి అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో కోర్టులో జాతీయ లోక్ అదాలత్ జరిగింది. ఈ లోక్ అదాలత్‌లో 159 వివిధ కేసులను పరిష్కరించారు. ఇందులో 130 ఎక్సైజ్ కేసులను పరిష్కరించి రూ.5,53,600 అపరాధ రుసం విధించారు. 8 క్రిమినల్ కేసులను పరిష్కరించి రూ.10 వేల అపరాధ రుసుం విధించారు. 18 ఎస్‌టీసీ కేసులను రూ.29,850 పరిష్కరించారు. మొత్తం 159 కేసులను పరిష్కరించి రూ.6,63,600 అపరాధ రుసం విధించినట్లు కోర్టు అధికారులు తెలిపారు. జడ్జి అశోక్ కుమార్, సీఐ రాజ్‌కుమార్, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

665 కేసుల పరిష్కారం

పావగడ: స్థానిక జేఎంఎఫ్‌సీ కోర్టు లో శనివారం ఏర్పాటు చేసిన లోక్ అదాలత్‌లో 665 కేసులు పరిష్కార మయ్యాయి. రూ.74.29 లక్షల సొమ్ము కూడా రికవరీ చేశారు. పావగడకు చెందిన దంపతులు చిన్న కారణాలతో 9 ఏళ్లపాటు విడిగా ఉంటున్నారు. పరిహారం కోసం భార్య కోర్టు మెట్లు ఎక్కింది. లోక్ అదాలత్‌లో దంపతులు ఒక్కటయ్యారు. న్యాయవాదులు మల్లికార్జున్, భగవంతప్ప, ఎల్.మారుతి తదితరులు దంపతులతో దండలు మార్పించారు.

మెరుగైన విద్య అందించండి



స్మార్ట్ క్లాస్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

పావగడ: మెరుగైన విద్యతోనే విద్యార్థులు ఉన్నత స్థాయిలో రాణించే అవకాశం ఉంటుందని చిక్కహళ్లి పీడీఓ అక్కులప్ప సూచించారు. తాలూకాలోని సాక్షర గ్రామంగా పేరు పొందిన కే రాంపురం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవ వేడుకల్లో ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీ 15వ ఫైనాన్స్ యోజన నిధుల నుంచి రూ 1.18 లక్షల వ్యయంతో స్మార్ట్ క్లాస్ ప్రక్రియను ప్రారంభించారు. హెచ్ఎం చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ ఖరీదైన ప్రైవేట్ పాఠశాలల కంటే ఉచిత ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య లభిస్తుందన్నారు. ఎస్డీఎంసీ అధ్యక్షుడు రాంపురం నాగేశ్ మాట్లాడుతూ ఒకప్పుడు సారా గ్రామంగా కుఖ్యాతి పొందిన కే రాంపురం గ్రామం గ్రామస్తుల సహకారంతో సాక్షర గ్రామంగా ప్రఖ్యాతి పొందిందన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

పరిగి: మండలంలోని పైడేటిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న 52 మంది విద్యార్థులకు శనివారం విద్యా సామగ్రి పంపిణీ చేశారు. మండల కేంద్రానికి చెందిన హరిప్రసాద్ తన తమ్ముడు శివప్రసాద్ జ్ఞాపకార్థం విద్యార్థులకు అట్టలు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం నీలకంఠారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం



హిందూపురంలో జిల్లా జడ్జి శైలజను సన్మానిస్తున్న ఐడీ అసోసియేషన్, ప్రభుత్వ వైద్యసిబ్బంది,వాసవీక్లబ్ సభ్యులు



హిందూపురంలోని బాలయేసు కళాశాలలో మాట్లాడుతున్న పీఓ అశ్వర్థ నారాయణ



హిందూపురంలోని కోర్టులొ కేక్ కట్ చేస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు, సిబ్బంది

హిందూపురం: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో హిందూపురం వాసవీ క్లబ్, ఇండియన్ డెంటల్ అసోసియేషన్ శ్రీసత్య సాయి జిల్లా విభాగం సంయుక్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాలకు చెందిన 115 మంది మహిళా ఉద్యోగులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా జడ్జి శైలజ హాజరై మాట్లాడారు. మహిళా అభ్యున్నతిలో దేశప్రగతి, కుటుంబ అభివృద్ధి ఉంటుందన్నారు. మహిళలను గౌరవించి సముచితస్థానం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఐడీఏ ప్రెసిడెంట్ డాక్టర్లు విజయ్‌బాబు, సురేఖాదేవి, వాసవి క్లబ్ అంతర్జాతీయ ఉపాధ్యక్షులు దాసా సందేష్, క్లబ్ అధ్యక్షులు రాజేంద్ర గుప్తా, కార్యదర్శి దాసా విష్ణు,తదితరులు పాల్గొన్నారు. అలాగే బాలయేసు డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు.ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి అశ్వర్థ నారాయణ, పీఓట హరీష్, అధ్యాపకురాలు మంజుల, విద్యార్థినులు పాల్గొన్నారు. సప్తగిరి కళాశాలలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి, మంజునాథ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పట్టణంలోని హెడ్‌పోస్టాఫీసులో పోస్టల్ సూపరింటెండెంట్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో నారీ శక్తి వారోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఉత్తమ మహిళా పోస్టల్ ఉద్యోగులు సబ్‌పోస్ట్‌మాస్టర్ భారతి,ఉత్తమ పోస్ట్‌ఉమెన్ దివ్యభారతి, ఉత్తమ కౌంటర్ క్లర్క్‌గా కుశబుమీనా, ఉత్తమ ఏజెంట్‌గా లీలా భాయి, ఉత్తమ సఫయి వర్కర్‌గా మురవానిలను సత్కరించి మెమెంటోలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో పోస్ట్ మాస్టర్ మార్కండేయ, ఏఎస్పీ మల్లికార్జున ఐపిబి మేనేజర్ మురళి తపాళా సిబ్బంది పాల్గొన్నారు. అలాగే హిందూపురం కోర్టులో న్యాయమూర్తులు, మహిళా న్యాయవాదులు, కోర్టు సిబ్బంది శనివారం మహిళా దినోత్సవం పురస్కరించుకొని కేక్ కట్ చేశారు.

పెనుకొండ: మంత్రి సవిత క్యాంప్ కార్యాలయంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత, బాలికల ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతిలత, రమణమ్మ, చంద్రకాంతమ్మ మహిళలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కోడూరు శ్రీనివాసులు, నాయకురాలు లక్ష్మీనరసమ్మ, మాజీ ఏపీటీఎఫ్ స్టేట్ కౌన్సిలర్ జవాజి నాగరాజు, వెంకటరమణ నాయక్, ఆంజనేయులు, చంద్రమౌళి, చంద్ర, సంజీవరాయుడు తదితర ఏపీటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

పరిగి: మండల కేంద్రంలోని కస్తూరీబా బాలికల పాఠశాలలో శనివారం దివ్య ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. చైర్మన్, బీజేపీ నాయకుడు పరిగి వేణుగోపాలరావు ఆధ్వర్యంలో ఎస్ఓ సువర్ణమ్మతో పాటూ ఉపాధ్యాయురాళ్లను సన్మానించారు. బీజేపీ మండలాధ్యక్షుడు నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అగళి: మహిళలు తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని ముందుకు సాగాలని విజ్ఞాన భారతి ప్రధానోపాధ్యాయుడు శివకుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని విజ్ఞాన భారతి పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఉపాధ్యాయులు చంద్రకళ, కవిత, సన్నమ్మను సన్మానించారు.

రొళ్ల: మహిళలు ఆర్థిక స్వాలంభన సాధించాలని ఆర్డీటీ రీజినల్ డైరెక్టర్ మల్లికార్జున, డైరెక్టర్ బాలాజీ తదితరులు పేర్కొన్నారు. శనివారం మండలంలోని ఎం.రాయాపురం, అగ్రహారం ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు.

గుడిబండ: మందలపల్లి ఆర్డీటీ కార్యాలయంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఏటీఎల్ మీనాక్షి మాట్లాడారు. అలాగే మండల కేంద్రలోని ఎంజేపీ బాలికల కళాశాలలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ ప్రసాద్, ఆర్డీటీ సీఓ మహేష్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమాజంలో మహిళల పాత్ర కీలకం

మడకశిర: సమాజంలో మహిళల పాత్ర కీలకమని ట్రైనీ డీఎస్పీ ఉదయపావని, సీడీపీఓ నాగమల్లేశ్వరి పేర్కొన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయ భవనంలో సీపీఐ, స్థానిక డిగ్రీ కళాశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మహిళ దినోత్సవాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించడం సంతోషదాయకమన్నారు. సమాజాభివృద్ధిలో మహిళల కృషి ఎంతో ఉందని తెలిపారు. సీడబ్ల్యూసీ మెంబర్ రఘువీరారెడ్డి, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్యేలు సుధాకర్, డాక్టర్ తిప్పేస్వామి, వైటీ ప్రభాకర్‌రెడ్డి, ఈరన్న, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో సీఐ రాజ్‌కుమార్, ఆర్డీటీ ఆర్డీ మల్లికార్జున, ఫోర్డ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ బత్రీష్ తదితరులు పాల్గొన్నారు.



పెనుకొండలో మహిళా దినోత్సవంలో పాల్గొన్న మహిళలు



మడకశిరలో కేక్‌కట్ చేస్తున్న ట్రైనీ డీఎస్పీఉదయపావని

12న 'ఫీజుపోరు' విజయవంతం చేయండి

రొళ్ల: పుట్టపర్తి జిల్లా కేంద్రంలో ఈ నెల 12న నిర్వహించే 'ఫీజు పోరు'ను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప శనివారం సాయంత్రం ఓ ప్రకటనలో కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు కావస్తున్న నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు లేక నిరుద్యోగ భృతి కింద రూ.3 వేలు చెల్లింస్తామని చెప్పి మోసగించారని విమర్శించారు. ఇక ఫీజురియింబర్స్‌మెంట్‌పై ఊసే లేకుండా పోయిందని ఆరోపించారు. ఫీజురీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడం వల్ల కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులపై తీవ్రమైన ఒత్తిడి తీసుకున్నారని మండిపడ్డారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

హిందూపురం: స్థానిక ఎంజీఎం హైస్కూల్ పాఠశాల ఆవరణలో ట్రినేటీ సర్వీసెస్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు డాక్టర్‌కుమార్ రాజా, కార్యదర్శి ఉషారాణి ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి ఆసుపత్రి పరీక్షా శిబిరం నిర్వహించారు. ట్రినేటి సర్వీసెస్, బెంగళూరు శంకర్ కంటి ఆసుపత్రి బృందం సంయుక్తంగా 550 మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఆపరేషన్ల కోసం 245మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో క్యాంప్ వలంటీర్ రహంతుల్లా, ట్రినిటీ సర్వీసెస్ ఆర్గనైజేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మల్బరీ షెడ్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్

మడకశిరరూరల్: మండలంలోని రేకులకుంట సమీపంలో శనివారం రైతు నాగభూషణంకు చెందిన మల్బరీ షెడ్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయినట్లు బాధిత రైతు తెలిపారు. షెడ్డులో పట్టు పురుగుల చంద్రికలు, సామగ్రి కాలిపోయి తీవ్రంగా నష్టం జరిగిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రూ.17 లక్షలకు పైగా నష్టం జరిగిందని బాధిత రైతు తెలిపారు.